ఆకట్టుకున్న గజల్ గానం



కార్యక్రమంలో గజల్ గాయకులు

గన్‌ఫౌండ్రీ: గజల్ వాగ్గేయకారిణి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన పది గజల్‌ల సంపుటాల పండుగను పురస్కరించుకొని ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన మహా గజల్ గానం ఆహూతులను ఆకట్టుకుంది. ఆరుగురు గాయనీ గాయకులు అందమైన బావుకథను మల్లీశ్వరి హృదయమైన భాషని, సౌందర్య కవితాత్మకతతో రచించిన పలు గజల్‌లను ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా గానం చేశారు. అనంతరం రాజా వాసిరెడ్డి మల్లీశ్వరీ మాట్లాడుతూ..తన గజల్ ప్రస్థానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు లక్ష్మీ భవాని, రుక్మిణి, శాంతి నిర్మల, ఎంఆర్‌కే ప్రభాకర్, శారద, నాగలక్ష్మి, గజల్ కవయిత్రి విజయ తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు అక్షరంపై ప్రభావం చూపిన వ్యక్తి చలం'



చలం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: తెలుగు అక్షరంపై అచెంచల ప్రభావం చూపిన వ్యక్తి చలం అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆదివారం రవీంద్రభారతిలో చలం భావన సంస్థ ఆధ్వర్యంలో జీవ జలం చలం సాహిత్య స్మారకోపాన్యాస సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..చలం రచనలు స్త్రీ పురుష సమానత్వాన్ని, ఆధిపత్యాలు లేని జీవితాన్ని స్పష్టంగా వివరించారని కొనియాడారు. స్త్రీకి స్వేచ్ఛ రావాలని ఆర్థిక స్వతంత్రం లభించాలని, స్త్రీకి విద్య ఎంతో అవసరమని ఆరోజుల్లోనే స్పష్టంగా చెప్పిన వ్యక్తి చలం అన్నారు. అనంతరం చలం స్త్రీ, ప్రేమ లేఖల గ్రంధాలపై రచయిత్రులు నెల్లుట్ల రమాదేవి, కెఎస్.మల్లీశ్వరీలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో చలం భావన కన్వీనర్ నాళేశ్వరం శంకరం, దాసోజు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

శాలిబండ: ఖాజీపురాలోని సయ్యద్ మంజిల్‌లో ఈనెల 19న ఉచిత ఆధార్ కార్డు క్యాంపును ప్రారంభించనున్నట్లు ఖాద్రియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అహ్మద్ హుస్సేనీ సయ్యద్ ఖాద్రీ తెలిపారు. ఖాద్రియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ భారత ప్రభుత్వ ఇండియా పోస్ట్ సహకారంతో ఆధార్ కార్డు క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19న ఆధార్ కార్డు నమోదు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు..ప్రతిరోజు 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తుందన్నారు. ఈ ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇస్లాం మత గురువు హైదర్‌పాషా కన్నుమూత



గోల్కొండ: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ముస్లిం మత పెద్ద మౌలానా సయ్యద్ నూర్ ఆలీషా ఖాద్రి హైదర్‌పాషా(89) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం రాత్రి గోల్కొండ రిసాలబజార్‌లోని తన స్వగృహంలో మృతి చెందారు. ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు, కుతుబ్‌షాహీ ఈద్గా హకీబ్ మౌలానా కారీ సయ్యద్ మతీన ఆలీషా ఖాద్రీకి స్వయాన తండ్రి. ఆయన అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం జమాలికుంట ముస్లిం శ్మశాన వాటికలో జరిగాయి.

యువతితో అసభ్య ప్రవర్తన

బాధితురాలి ఫిర్యాదు..
నిందితుడి రిమాండ్



నిందితుడు బికాస్ గడాయ్

ఫిలింనగర్:జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో పని చేస్తున్న యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఆమె రాకపోకలపై, కదలికలపై నిఘా పెట్టి దారికాచి ఇబ్బందులకు గురిచేస్తూ వేధిస్తున్న అదే ఆస్పత్రిలో హౌజ్ కీపింగ్ చేస్తున్న నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఒడిశాకు చెందిన బికాస్ గడాయ్(33) కొంతకాలంగా అపోలో ఆస్పత్రిలో హౌజ్ కీపింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. హౌజ్ కీపింగ్‌లో పని చేస్తున్న యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. దారికాచి ఆమెను ఇబ్బందులకు గురి చేయసాగాడు.దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.









అగ్ని ప్రమాదం..

ఉలిక్కిపడ్డ పాతనగరం

గుల్జార్‌హౌస్ వద్ద భారీ అగ్ని ప్రమాదం

అగ్నిప్రమాదం సమాచారం తెలియగానే ఆందోళన గురైన ప్రజలు

17 మంది మృతితో స్థానికంగా విషాదఛాయలు

చార్మినార్: గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్ని ప్రమాదంతో ఆదివారం పాతబస్తీ ఉలిక్కిపడింది. ఆదివారం వస్తుందనగానే అందరూ కాస్త రిలాక్స్‌గా ఫీల్ అవుతారు. అయితే ఈ ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న పాతబస్తీ ప్రజలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తెల్లవారంగానే అగ్ని ప్రమాదంలో దాదాపు 17 మంది ఒకేసారి మృతి చెందారని వార్త దహించి వేసింది. పాతబస్తీలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ దుర్వార్తను జీర్ణించుకోలేకపోయారు. తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఎలా జరిగింది..ఎంతమంది చనిపోయారు..వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారా..ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎవరైనా ఉన్నారా..అనే విషయాలపై తెలిసిన వారిని ఆరా తీయడం మొదలెట్టారు. కొంతమంది ఏకంగా మీడియా మిత్రులకు ఫోన్లు చేసి సమాచారాన్ని కనుక్కొని తమ సంతాపాన్ని తెలియజేశారు. ఇది అత్యంత దారుణమైన బాధాకర సంఘటన అని వ్యాఖ్యానించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పాతబస్తీలోని అన్ని ప్రాంతాల్లో నిబంధనలకు అనుగుణంగా సేఫ్టీ మెజర్స్ పాటిస్తే బాగుంటుందనే అభిప్రాయాలను వెలిబుచ్చారు. రెండు కుటుంబాలకు చెందిన వారంతా మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అటువైపు రాకపోకలను నిలిపివేశారు.

మృతిచెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలి



ఉస్మానియా వద్ద కేడీ.దినేష్, నాగు నాగేష్

అఫ్జల్‌గంజ్: గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కేడీ.దినేష్, హైదరాబాద్ పార్లమెంటర్ కోఆర్డినేటర్ నాగు నాగేష్ డిమాండ్ చేశారు. ఉస్మానియా ఆసుపత్రిలో మృతుల బంధువులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆర్.ఎం.ఓ కులకర్ణిని కలిసి గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మృతిచెందిన వారికి రూ.20 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదంలో భారీ ప్రాణ నష్టం బాధాకరం



కె.ఎల్.శ్రీనివాస్

నాంపల్లి: మహానగరంలో ఒక ప్రణాళిక లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని, ఈ నిర్మాణాలే అగ్ని ప్రమాదాలకు కారణం అవుతున్నట్లు సామాజికవేత్త కె.ఎల్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం పాతబస్తీలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై ఆయన స్పందించారు. ఈ మేరకు నాంపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాల్లో ప్రమాణాలకు తిలోదకాలిచ్చి రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నారని, సెట్ బ్యాక్‌లు వదలకుండా నిర్మించే బహుళ అంతస్తుల వద్దకు అగ్ని మాపక సిబ్బంది వెళ్లలేని విధంగా వీధులు ఉన్నట్లు వివరించారు. ఇలాంటి నిర్మాణాలతోనే పాతబస్తీలో జరిగిన అగ్నిప్రమాదానికి భారీ ప్రాణనష్టం సంభవించిందన్నారు. ఈ ఘటన జరగడం చాలా బాధాకరం అన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నానల్‌నగర్, కార్వాన్, లంగర్‌హౌస్ డివిజన్‌లకు చెందిన పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునే పథకానికి సరైన ధ్రువపత్రాలు జత చేయాలని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు అన్ని ధ్రువపత్రాలు ఉన్న ఏ ఒక్క సంక్షేమ పథకం దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ రఫత్‌హుస్సేన్, అబీబ్ చౌష్ తదితరులున్నారు.

అన్నదానం



గోల్కొండ: సకీనా ఫౌండేషన్ ద్వారా నిరుపేదలు, వలస కూలీల కుటుంబాలకు అన్నదానం చేస్తున్నామని సకీనా ఫౌండేషన్ ఛైర్మన్ మహ్మద్ ఆసీఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. ఆదివారం టోలిచౌకీ సూర్యనగర్ కాలనీలోని సకీనా ఫౌండేషన్ మాషా అల్లా కిచెన్ వద్ద నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాషాఅల్లా కిచెన్ వద్దకు రాలేని వలస కూలీల కుటుంబాలకు వారు నివసించే గుడిసెల వద్దకే ఆహారాన్ని ప్యాక్ చేసి పంపుతున్నాన్నారు. మరో వైపు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని నిరుపేదలు నివసించే ప్రాంతాల్లో వేసవి శిబిరాలకు విశేష స్పందన వస్తుందన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని టోలిచౌకీ, లంగర్‌హౌస్, గోల్కొండ తదితర ప్రాంతాల్లోని లేబర్ అడ్డాల వద్ద కూడా ప్రతి ఆదివారం ఆహారాన్ని పంపిణీ చేస్తామన్నారు.

అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో విద్యావేత్త జితేందర్ సింగ్, గాలయ్య, రవికుమార్

అబిడ్స్: అభిరుచులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని రిలయన్స్ హైటెక్ విద్యాసంస్థల డైరెక్టర్, విద్యావేత్త టి.జితేందర్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం రిలయన్స్ హైటెక్ జూనియర్ కళాశాల, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్లు సంయుక్తంగా 2024–25 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేసి అభినందించారు. ముందుగా డైరెక్టర్ జితేందర్ సింగ్, రిలయన్స్ హైటెక్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.నిశాసింగ్, టీఆర్‌ఎస్‌ఎంఏ ఆసిఫ్‌నగర్ మండల గౌరవ అధ్యక్షుడు గాలయ్య, అధ్యక్షుడు రవికుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేందర్ సింగ్ మాట్లాడుతూ..తమ విద్యాసంస్థలు, టీఆర్‌ఎస్‌ఎంఏల ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులను సత్కరించి ప్రతిభా పురస్కారాలను అందించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. టీఆర్‌ఎస్‌ఎంఏ గౌరవ అధ్యక్షుడు గాలయ్య, అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ..ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను రిలయన్స్ హైటెక్ విద్యాసంస్థలు బోధిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా జితేందర్ సింగ్ చేస్తున్న సేవలు అమోఘంగా ఉన్నాయన్నారు. విద్యారంగ వ్యాప్తికి, విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు తమ అసోసియేషన్ నిరంతరంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్లు, టీచర్లు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆషాఢ బోనాలను వైభవంగా నిర్వహిస్తాం'



గాజుల అంజయ్యను సన్మానిస్తున్న ప్రతినిధులు

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకోవాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఛైర్మన్ గాజుల అంజయ్య పిలుపు నిచ్చారు. శనివారం రాత్రి మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. రొటేషన్ పద్ధతిలో వచ్చే ఉమ్మడి కమిటీ బాధ్యతలను ఈసారి అక్కన్న మాదన్న ఆలయ కమిటీకి ప్రస్తుత కమిటీ ఛైర్మన్ గాజుల అంజయ్య అప్పగించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ..ఆషాఢ మాసంలో జరిగే బోనాల జాతర ఉత్సవాలకు పాతబస్తీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈ నేపథ్యంలో గత కొన్నేళ్లుగా అంగరంగ వైభవంగా మనమంతా ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గతంలో లాగే ఈసారి కూడా ఘనంగా నిర్వహించడానికి ఇప్పటి నుంచే శ్రీకారం చుట్టాలన్నారు. బాధ్యతలు అప్పగించిన గాజుల అంజయ్యను ఆలయాల కమిటీ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ గౌడ్, మధుసూదన్ యాదవ్, ఆదర్శ మహేష్, శశాంక్ తివారి, దినేష్, సుమన్ కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంతా చెత్తమయం



శాతంచెరువు కట్టపై పేరుకుపోయిన వ్యర్థాలు

గోల్కొండ: నయాకీలాలోని శాతం చెరువులో టన్నుల కొద్ది వ్యర్థాల డంపింగ్‌లపై గతంలో 'సాక్షి'లో ఎన్నో కథనాలు వచ్చాయి. ఇదిలా ఉండగా మూడు నెలల క్రితం 'సాక్షి'కథనానికి స్పందించిన బల్దియా అధికారులు శాతం చెరువుతో పాటు దాని పరిసరాల్లో వ్యర్థాల డంపింగ్ నివారణకు చెరువు వద్ద డీఆర్‌ఎఫ్ సిబ్బందిని నియమించారు. 24 గంటలు సెక్యూరిటీ ఉండేలా బందోబస్తు చేశారు. ఇదిలా ఉండగా కొన్ని రోజుల నుంచి చెరువు కట్ట వద్ద విధులు నిర్వహించే డీఆర్‌ఎఫ్ సిబ్బంది కానరావడం లేదు. వ్యర్థాల డంపింగ్ ఆపడానికి సిబ్బంది లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన కొందరు వ్యక్తులు ఆటో ట్రాలీలు, డీసీఎం వ్యాన్‌లలో వ్యర్థాలను తెచ్చి చెరువు కట్ట పొడవునా డంప్ చేస్తున్నారు. బల్దియా పారిశుద్ధ్య విభాగం వారు ఈ చెత్తను తరలించడం లేదు. ప్రతిరోజూ రాత్రి డంపింగ్ అవుతున్న వ్యర్థాలు గుట్టల్లా పేరుకుపోయాయి. వ్యర్థాలు కుల్లి శాతం చెరువుపై నుంచి రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాతం చెరువులో గుర్రపు డెక్క కూడా విపరీతంగా పెరిగిపోతుంది. గుర్రపు డెక్క తొలగించి వ్యర్థాలను సైతం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చెరువు కట్ట ఇరువైపులా సెక్యూరిటీ గార్డులను నియమించాలని కోరుతున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: జ్యోతిర్మయి తెలుగు గజల్ అకాడమీ ఆధ్వర్యంలో గజల్ రచయిత్రి మల్లా జ్యోతిర్మయి రచించిన 'చూపు ఎంత అలిసిందో'పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ..గజల్ ఒక్కసారి వింటే మనం కూడా పాడాలనిపిస్తుందన్నారు. గజల్ పుస్తకాలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందని అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు దేవిప్రసాద్, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక సాహితీ పూర్వ సంచాలకులు డి.విజయభాస్కర్, గజల్ కవి సూరారం శంకర్, కళారత్న బిక్కి కృష్ణ, గజల్ గాయని స్వరూప తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు..మరిచారు..



ప్రమాదకరంగా మారిన రోడ్డు

గౌలిపురా: హనుమాన్‌నగర్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీ పనుల కోసం తవ్విన రోడ్డును తిరిగి పూడ్చకపోవడంతో గుంతగా ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హనుమాన్‌నగర్ నుంచి ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత కారణంగా వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా మారిన రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయ కమిటీ ఛైర్మన్‌గా మారుతీయాదవ్



చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ నూతన ఛైర్మన్‌గా బి.మారుతీ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కమిటీ సర్వసభ్య సమావేశంలో మారుతీ యాదవ్‌ను ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఐదేళ్లుగా ఆయన కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ వస్తున్నారు. త్వరలోనే మరో సమావేశం ఏర్పాటు చేసి మిగతా కార్యవర్గాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్లు జి.కాశీనాథ్ గౌడ్, సి.బంగ్లా రాజు యాదవ్, కె.విష్ణుగౌడ్, కె.వెంకటేష్, ఎ.మాణిక్ ప్రభు గౌడ్, సి.వెంకటేష్, సి.రాజు కుమార్ యాదవ్, సి.రాజేందర్ యాదవ్, తిరుపతి నర్సింగ్ రావు, శీర రాజ్‌కుమార్, కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్, కోశాధికారి పోసాని సతీష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుకు నేడు ఆఖరు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రవేశ పరీక్ష ఆధారిత డిప్లొమో, పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను సమర్పించడానికి సోమవారం చివరి తేదీ. ప్రవేశ పరీక్షలను జూన్ 12,13,14 తేదీలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్), ఎంఎడ్, మాస్టర్ ఆఫ్ లా, బీటెక్ (కంప్యూటర్‌సైన్స్) ఎల్ఎల్‌బి, బీఎడ్, డీఎల్ఎడ్, పాలిటెక్నిక్ డిప్లొమోలలో ప్రవేశాలు అందిస్తారు, వివిధ పీహెచ్‌డీ కోర్సులకు కూడా దరఖాస్తులు కోరుతున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో చూసి దరఖాస్తును పూర్తి చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. మరిన్ని వివరాలకు 040–23006612 ఎక్స్‌టెన్షన్ 1801ను సంప్రదించాలి.

అక్రమ నిర్మాణం కూల్చివేత

గచ్చిబౌలి: ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించగా శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలంలో పిల్లర్లు వేస్తున్నారు. ఫిర్యాదు అందడంతో ఆర్ఐ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పిల్లర్లు, పునాదుల కోసం వేసిన కాంక్రీట్‌ను జేసీబీతో తొలగించారు. ఆ స్థలం విలువ కోటి రూపాయల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు. కేశవ్‌నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న స్థానికులు ఇతరులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

యాగశాల భూమి పూజ ప్రారంభం

అత్తాపూర్: హైదర్‌గూడలో ఈనెల 23 నుంచి 25 వరకు నిర్వహించే శ్రీ ప్రణవ భక్త సమాజం ఏకశతపంచోత్తర మహోత్సవ కార్యక్రమంలో భాగంగా యాగశాల కోసం ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజం ఉపాధ్యక్షుడు బర్ల మల్లారెడ్డి, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, సాబాద విజయ్‌కుమార్, సభ్యులు సులిగె మహేందర్, విద్యాసాగర్, సాయియాదవ్, కిషన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌లో డాక్టర్ పోతన్న జ్ఞాపకార్థం శ్రీ చంద్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై పారంభించారు. అనంతరం ఆయనతో పాటు ఇతరులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేసి అవసరమున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పోతన్న కుటుంబ సభ్యులతో పాటు సోమ శ్రీనివాస్‌గుప్తా, డాక్టర్లు సరితరెడ్డి, సుస్మితరెడ్డి, షోయబ్, సౌమ్యశ్రీ, ఉప్పల్ శ్రీను, వెంకటరమణగుప్తా, అశోక్‌కుమార్, సంతుగౌడ్, విజయ్, బొంబాయి రవి, గోపాల్‌నాయక్, రాము, కురుమప్ప, మధుసూదన్ రెడ్డి, వైద్యులు కృష్ణ, కుమార్, రామకృష్ణ, మురళీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

